సాక్షి చిత్తూరు

శనివారం : 13 : జూలై : 2024



గరుడ వాహనంపై అభయం

శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు వైభవంగా ముగిశాయి. - 8లో



ఫ్యాషన్ 'షో'

తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఆడిటోరియంలో లోటస్ డిజైనర్ ఫ్యాషన్ షో అలరించింది. - 8లో



శోకసంద్రం

'ఇక మేము ఎవరికోసం బతకాలి దేవుడా..?' అంటూ వలసకూలీల బంధువుల రోదనలతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి దద్దరిల్లింది. - 8లో

న్యూస్‌రీల్

జిల్లాలో స్తంభించిన సర్వర్



రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్న ప్రజలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా రిజిస్ట్రేషన్ శాఖలో సేవలకు సర్వర్ సమస్య తలెత్తింది. సర్వర్ స్తంభించడంతో రెండురోజులుగా వివిధ లావాదేవీల నిమిత్తం వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు. రెండో శనివారం, ఆదివారం సెలవు రోజులు కాబట్టి ఎక్కువగా గురు, శుక్రవారాలు రిజిస్ట్రేషన్లు ఎక్కువ చేయడం పరిపాటి. గురువారం సర్వర్ మొరాయించడంతో శుక్రవారం జిల్లాలోని 8 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఎక్కువ సంఖ్యలో వచ్చారు. ఈసీల కోసం పడిగాపులు కాశారు. కాసేపు సర్వర్ పనిచేసినా మళ్లీ ఈకేవైసీ మొరాయించింది. దీంతో ఉస్సూరంటూ వెనుదిరిగారు. సోమవారానికి సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు పేర్కొన్నారు.

'కడా' పీడీగా వికాస్ మర్మట్

కుప్పం: కుప్పం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా వికాస్ మర్మట్ శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కుప్పం అర్బన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, స్థానిక నాయకులు పీఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్, మున్సిపల్ అధ్యక్షులు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, జేసీని కలిసిన కడా పీడీ



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

చిత్తూరు కలెక్టరేట్ : 'కడా' ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్ శుక్రవారం చిత్తూరులో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జేసీ శ్రీనివాసులను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. బాధ్యతల స్వీకరణ పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం కడా పరిధిలోని అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కమ్మనపల్లెలో మలేరియా బృందం పర్యటన



నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలిస్తున్న జయశంకర్

బైరెడ్డిపల్లి: మండలంలోని కమ్మనపల్లెలో విషజ్వరాలు ప్రబలుతున్నాయనే సమాచారం అందుకున్న మలేరియా బృందం శుక్రవారం గ్రామంలో పర్యటించింది. సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ ఇంటింటా లార్వా, ఫీవర్ సర్వేలు నిర్వహించారు. జ్వరాలు విజృంభించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాజేంద్రబాలాజి, వైద్యాధికారి విజయ్‌చంద్ర, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, ఆరోగ్య సిబ్బంది పద్మ, జ్యోత్స్న, అమరమ్మ, విజయమ్మ, పంచాయతీ కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

డిగ్రీ కౌన్సెలింగ్ షెడ్యూల్ గడువు పొడిగింపు

తిరుపతి సిటీ: టీటీడీ, ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్ గడువును ప్రభుత్వం పొడిగించింది. ప్రస్తుతం ఆన్‌లైన్ అడ్మిషన్స్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓఏఎండీసీ) వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేస్తున్నారు. ఈ గడువు 10వ తేదీతో ముగిసింది. అభ్యర్థుల వినతి మేరకు ఈ నెల 20వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. 23వ తేదీ నుంచి 26 వరకు వెబ్ ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించింది. 27 నుంచి వెబ్ ఆప్షన్ల మార్పునకు వెసులుబాటు కల్పించి, ఈ నెల 31న సీట్ల కేటాయింపు చేయనున్నారు.

అడ్డదారుల్లో వచ్చేస్తాం!



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిల్లా సమగ్రశిక్ష అభియాన్ శాఖలో గతంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయ జోక్యం అధికమైంది. తాము తలచుకుంటే ఏమైనా చేస్తామనే ధోరణిలో తెలుగుదేశం పార్టీకి అనుబంధమైన టీచర్ల బ్యాచ్ బెదిరింపులకు దిగుతోంది. ఆదర్శంగా ఉండాల్సిన టీచర్లు వివిధ విషయాల్లో ఆ శాఖ ఉన్నతాధికారులను రాజకీయ ఒత్తిళ్లకు గురిచేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది.

- సమగ్రశిక్ష శాఖలో సెక్టోరల్ పోస్టుల్లో 'పచ్చ' టీచర్ల రాజకీయం
- నోటిఫికేషన్ లేకుండానే సెక్టోరల్ అధికారుల పోస్టుల భర్తీ
- మాట వినాల్సిందేనని ఉన్నతాధికారులకు బెదిరింపులు
- నిబంధనలకు వ్యతిరేకంగా నియామకాలు
- కలెక్టర్ సమగ్ర విచారణ చేయించాలని టీచర్ల డిమాండ్

చిత్తూరు కలెక్టరేట్ : తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పార్టీకి అనుకూలమైన టీచర్ల బ్యాచ్ విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖ చుట్టూ ప్రదక్షిణలు చేయడం ప్రారంభించింది. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల అండదండలతో ఎలాగైనా పాఠశాలకు ఎగనామం పెట్టి డిప్యూటేషన్ వేయించుకోవాలని స్కెచ్ వేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా డిప్యూటేషన్‌లకు అవకాశం లేకపోవడంతో జిల్లా సమగ్రశిక్ష శాఖ లోని సెక్టోరల్ పోస్టులపై కన్నేశారు. ఆ పోస్టుల్లో పాగా వేసేందుకు స్కెచ్ వేశారు. దీని ప్రకారం టీడీపీ ఎమ్మెల్యేల చేత జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫోన్ చేయించి బెదిరింపులకు గురిచేయడం విద్యాశాఖలో హాట్ టాపిక్‌గా మారింది. జిల్లా సమగ్రశిక్ష శాఖలో విధుల్లో ఉన్న నలుగురు సెక్టోరల్ అధికారులు వెంటనే విధుల నుంచి తప్పుకోవాలని, తాము విధుల్లో చేరుతామని అల్టిమేటం ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది.

ముదురుతున్న పోస్టుల రాజకీయం

జిల్లా సమగ్రశిక్ష శాఖలో రోజురోజుకూ సెక్టోరల్ పోస్టుల భర్తీలో రాజకీయ జోక్యం విమర్శలకు తావిస్తోంది. ఆ శాఖలో ఐఈ కో–ఆర్డినేటర్‌గా ప్రభాకర్ వర్మ, ఏఎల్‌ఎస్ కో–ఆర్డినేటర్‌గా అజయ్‌కుమార్, ఏసీఎంఓగా ఉదయలక్ష్మి, ఏఎంఓగా పల్లవి విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో రాజకీయ ఒత్తిళ్లకు తట్టుకోలేక ఏఎంఓ పల్లవి ఇటీవల తన పోస్టు నుంచి తప్పుకుంటున్నట్లు లిఖిత పూర్వకంగా రాసిచ్చి పాఠశాలకు పోస్టింగ్ వేయించుకుని వెళ్లిపోయారు. తాజాగా ఐఈ కో–ఆర్డినేటర్ ప్రభాకర్‌వర్మ, ఏఎల్‌ఎస్ కో–ఆర్డినేటర్ అజయ్‌కుమార్ చేత అనారోగ్యం వల్ల తప్పుకుంటున్నట్లు లేఖ రాయించుకుని, వారిని ఆ పోస్టుల నుంచి తప్పించారు.

బడికి వెళితే పాఠాలు చెప్పాలి కదా!

బడికి వెళ్తే పాఠాలు చెప్పాల్సి ఉంటుందని భావించిన టీచర్లు టీడీపీ ప్రజాప్రతినిధుల అండదండలతో సమగ్రశిక్ష శాఖలో తిష్ట వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కార్యాలయంలో ఉంటే ప్రజాప్రతినిధుల అండదండలున్న తమ జోలికి ఎవరూ రారనే ఉద్దేశంతో సమగ్రశిక్ష శాఖలోకి అడుగు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అడ్డదారుల్లో సమగ్రశిక్ష పోస్టుల భర్తీ ప్రక్రియపై కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని విచారణ చేయించాలని టీచర్లు డిమాండ్ చేస్తున్నారు. నియమ, నిబంధనల ప్రకారం సెక్టోరల్ అధికారులను నియమించాలని కోరుతున్నారు.

నోటిఫికేషన్ లేకుండానే పోస్టుల భర్తీ

జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో ఉండే సెక్టోరల్ అధికారుల పోస్టులను భర్తీ చేయాలంటే ఆ శాఖ ఎస్పీడీ జారీచేసిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. ముందస్తుగా నోటిఫికేషన్ జారీచేసి ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను ప్రకటించాలి. ఆ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానించి నియమ నిబంధనలు పరిశీలించిన తర్వాత భర్తీ చేయాలి. అవేవీ చేయకనే టీడీపీ నేతల ఆదేశాల మేరకు పోస్టులను భర్తీ చేస్తుండడం విమర్శలకు తావిస్తోంది. సమగ్రశిక్ష శాఖలో ఏసీఎంఓగా పనిచేస్తున్న ఉదయలక్ష్మి మెడికల్ లీవులో ఉన్నారు. మెడికల్ లీవ్‌లో ఉన్న సమయంలో పోస్టు భర్తీ చేయకూడదనే నిబంధన ఉన్నప్పటికీ ఆమె స్థానంలో జయప్రకాష్‌నాయుడును నియమించడం చూస్తే రాజకీయం ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. బుధవారం ఆయన విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు సైతం స్వీకరించారు. ఐఈ కో ఆర్డినేటర్ ప్రభాకర్‌వర్మ, ఏఎల్‌ఎస్ కో–ఆర్డినేటర్ అజయ్‌కుమార్‌ను విధుల నుంచి తప్పించారు. వారిద్దరి స్థానంలో శ్రీధర్, రెడ్డి రమేష్‌ను అడ్డదారుల్లో నియమించేందుకు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. గత వైఎస్సార్‌సీపీ పాలనలో అడ్డదారి నియామకాలు ఎప్పుడూ జరగలేదని టీచర్లు, ఇప్పుడు నియయ నిబంధనలకు పాతర వేశారని టీచర్లే మండిపడుతున్నారు. అర్హత ఉన్న వారికి అవకాశం ఇవ్వకుండా ఏకపక్షంగా కుల ప్రాతిపదికన సెక్టోరల్ పోస్టులను కట్టబెట్టారని విద్యాశాఖలో చర్చనీయాంశమైంది.



జిల్లా కేంద్రంలోని సమగ్రశిక్ష కార్యాలయం



ఏసీఎంఓగా చేరిన జయప్రకాష్‌నాయుడు

నియమ నిబంధనలు ఇలా...

- సమగ్రశిక్ష శాఖలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏఎంఓ) పోస్టుకు ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌గా ఐదేళ్ల పనిచేసిన అనుభవం ఉండాలి. పీజీ పూర్తి చేసిన వారై ఉండాలి.
- కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ (సీఎంఓ) పోస్టుకు స్కూల్ అసిస్టెంట్‌గా 8 సంవత్సరాలు, పీజీ పూర్తి చేసి ఉండాలి.
- ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కో–ఆర్డినేటర్ (ఐఈ కో ఆర్డినేటర్) పోస్టుకు స్కూల్ అసిస్టెంట్‌గా 8 సంవత్సరాలు, పీజీ, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డీఈడీ, బీఈడీ ఫౌండేషన్ కోర్సు చేసి ఉండాలి.
- నోటిఫికేషన్ జారీచేసే తేదీ నాటికి 55 ఏళ్లలోపు వయసు ఉన్న టీచర్లు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలి.
- దరఖాస్తు చేసుకునే వారందరికీ బేసిక్ కంప్యూటర్ స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. ఈ నిబంధనలను ఏమీ పాటించకుండానే జిల్లా సమగ్రశిక్ష శాఖలో సెక్టోరల్ పోస్టుల నియామకాలు జరగడం గమనార్హం.

కుటుంబ సలహా కేంద్రం ప్రారంభం

- మహిళా సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: స్థానిక దర్గా కూడలిలోని మహిళా పోలీస్ స్టేషన్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన కుటుంబ సలహా కేంద్రాన్ని శుక్రవారం ఎస్పీ మణికంఠ ప్రారంభించారు. స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. మహిళల భద్రత, కుటుంబంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి ఈ కేంద్రం అందరికీ ఉపయోగపడుతుందన్నారు. మహిళలపై హింసను అరికట్టడం, కుటుంబ సుస్థిరత, దంపతుల మధ్య వివాదాలు, ఇతర సమస్యలకు పరిష్కారం చూపాలన్నదే ఈ కేంద్రం లక్ష్యమన్నారు. అవసరమైన పక్షంలో బాధితులకు ఇక్కడ మానసిక వైద్య నిపుణులు, కౌన్సెలింగ్ నిష్ణాతులు, పోలీసులు కలిసి కౌన్సెలింగ్ ఇస్తారన్నారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులున్నా నిర్భయంగా కుటుంబ సలహా కేంద్రాన్ని ఆశ్రయించవచ్చన్నారు. అనంతరం టూటౌన్, ట్రాఫిక్ స్టేషన్లను ఎస్పీ పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీలు సుధాకర్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, సీఐలు విశ్వనాథరెడ్డి, ఉలసయ్య, లక్ష్మణ, నిత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ టీబీసీ వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 65,392 మంది స్వామివారిని దర్శించుకోగా 29,015 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

బదిలీ అయిపోతాం.. మాకెందుకులే అనుకోవద్దు

- విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు
- తహసీల్దార్లకు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు హెచ్చరిక

చిత్తూరు కలెక్టరేట్ : బదిలీ అయిపోతాం...ఇక మాకెందుకులే అని తహసీల్దార్లు భావించరాదని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి తహసీల్దార్లతో పలు అంశాలపై కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఎన్నికలు అయిపోయాయి కదా..సొంత జిల్లాలకు వెళ్లిపోతామనే అలసత్వ ధోరణి వీడి ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంతో రెవెన్యూ శాఖ కీలకపాత్ర పోషించిందని, అలాగే జిల్లాలో ప్రజా సమస్యల విషయంలోనే ఇదే పనితీరు కనబరచాలన్నారు. తహసీల్దార్లు ప్రతి రెండు గంటలకోసారి శాఖాపరంగా మెయిల్స్‌ను పరిశీలిస్తూ ఉండాలన్నారు. కాలయాపన చేయకుండా రెవెన్యూ అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సీఎం పర్యటనలో సీఎం సహాయనిధి కోసం అందిన 97 అర్జీలను పరిశీలించి ఈ నెల 16వ తేదీ లోపు నివేదికలను పంపాలన్నారు. అదే రోజు సీఎం సహాయనిధి అంశంపై సమీక్ష ఉంటుందన్నారు. జనన, మరణ, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరు అధిక సంఖ్యలో పెండింగ్ ఉన్నట్లు చెప్పారు. త్వరితగతిన ధ్రువపత్రాలను మంజూరు చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా 15వ తేదీ లోపు నిత్యావసర సరుకుల పంపిణీ పూర్తి చేయాలని, దీనిని తహసీల్దార్లు పర్యవేక్షించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ పుల్లయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భవాని, డీఎస్‌ఓ శంకరన్, డీఎల్‌డీఓ రవికుమార్, సర్వేశాఖ ఏడీ గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

గ్రంథాలయ పన్ను బకాయిలను చెల్లించండి: జేసీ

జిల్లాలోని నగరపాలక, పురపాలక, గ్రామపంచాయతీల నుంచి గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన పన్ను బకాయిలను చెల్లించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. జిల్లా స్థాయి గ్రంథాలయ పన్నుపై శుక్రవారం కలెక్టరేట్‌లో జేసీ సమీక్షించారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం స్థానిక సంస్థలు వసూలు చేసిన ఆస్తి పన్నులో 8 శాతం జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాలన్నారు. చాలా కార్యాలయాలు 2007–08 నుంచి 2023–24 వరకు పన్ను చెల్లించలేదని తెలిపారు. సంబంధిత కార్యాలయాల అధికారులు పన్ను బకాయిలను వెంటనే సంబంధిత ఖాతాల్లో జమచేయాలని ఆదేశించారు. సమీక్షలో డీపీఓ లక్ష్మి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ కృష్ణారెడ్డి, పుంగనూరు, నగరి, పలమనేరు మున్సిపల్ కమిషనర్లు నరసింహప్రసాద్, వెంకటరామిరెడ్డి, జిల్లా గ్రంథాలయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నెల వ్యవధిలో 25 శిశు మరణాలు

- సమీక్షించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ
- మాతా–శిశు మరణాల కట్టడే లక్ష్యం పనిచేయాలని ఆదేశం



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మాతా–శిశు మరణాల కట్టడే లక్ష్యంగా పనిచేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి అధికారులను ఆదేశించారు. మాతా–శిశు మరణాలపై శుక్రవారం చిత్తూరులోని తన కార్యాలయంలో ఆమె సమీక్షించారు. నెల వ్యవధిలో రెండు పీహెచ్‌సీల పరిధిలో రెండు మాతృ మరణాలు, 21 పీహెచ్‌సీల పరిధిలో 25 శిశుమరణాలపై అధికారులు, సిబ్బందిని ఆమె ప్రశ్నించారు. మరణాలకు కారణాలేమిటో అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో మాతా–శిశు మరణాలు జరగకుండా చూడాలన్నారు. గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, హైరిస్క్ కేసులను నిత్యం పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో వైద్యాధికారులు లత, ఉషశ్రీ, శిరీష, అరుణ, ధనలక్ష్మి, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి ఇంటింటా కుష్ఠు సర్వే

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఇంటింటా కుష్ఠు వ్యాధి సర్వేను పకడ్బందీగా చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి దేవి ఆదేశించారు. చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో శుక్రవారం ఇంటింటా కుష్ఠు వ్యాధి సర్వేపై జిల్లా క్షయ నివారణ అధికారులు, సిబ్బంది ఆశా వర్కర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు సర్వే చేయాలన్నారు. కుష్ఠు అనుమానిత లక్షణాలున్న వ్యక్తులను గుర్తించి వారి వివరాలను కార్యాలయానికి అందజేయాలన్నారు. అనంతరం సర్వే విధివిధానాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, డీఐఓ అనిల్, వైద్యులు సాయి షర్మిల, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించండి

- కాంట్రాక్టు లెక్చరర్ల బదిలీల కౌన్సెలింగ్‌లో జేసీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తే కాంట్రాక్ట్ లెక్చరర్లు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం స్థానిక పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్ల బదిలీల కౌన్సెలింగ్, పోస్టుల రెన్యూవల్స్ ప్రక్రియను చైర్మన్ హోదాలో జేసీ హాజరై నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 8 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న 51 మంది కాంట్రాక్ట్ లెక్చరర్లకు ప్రభుత్వ ఆదేశాల మేరకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. కాంట్రాక్ట్ లెక్చరర్లు కోరుకున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు బదిలీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జీవనజ్యోతి, వైస్ ప్రిన్సిపల్ మీరా సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

బోయకొండలో రాహుకాల అభిషేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఈఓ ఏకాంబరం తదితరులు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం భక్తి ప్రపత్తులతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. వేకువ జామున ఆలయాన్ని శుద్ధి చేసి అమ్మవారి గర్భాలయాన్ని మామిడి, వేపాకు, పూలతోరణాలతో సుందరంగా ముస్తాబుచేశారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో 10:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య రాహుకాల అభిషేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి పూజలు చేయించారు. మహిళలు ఉపవాస దీక్షలతో మొక్కులు చెల్లించారు. ఉభయదారులకు ఈఓ తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

భక్తులకు ఉచిత అన్నప్రసాదం

గంగమ్మ ఆలయం వద్ద ఉచిత అన్నప్రసాద కేంద్రంలో సుమారు 2 వేల మందికి భక్తులకు ఈఓ పర్యవేక్షణలో అన్న ప్రసాద వితరణ చేశారు. అన్న ప్రసాద కేంద్రం నిర్వహణకు దాతలు తోడ్పాటు ఇవ్వాలని కోరారు.

జైన్ గుజ్జు పరిశ్రమను సందర్శించిన కలెక్టర్



జైన్ గుజ్జు పరిశ్రమలో మామిడి కాయలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

గంగాధర నెల్లూరు: గంగాధర్ నెల్లూరులోని జైన్ గుజ్జు పరిశ్రమను శుక్రవారం చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సందర్శించారు. పరిశ్రమలో ప్రాసెసింగ్ విధానాన్ని, ల్యాబ్ పనితీరును పరిశీలించారు. ఇక్కడి నుంచి అంతర్జాతీయ మార్కెట్‌కు మామిడి పల్ప్ ఎగుమతి చేస్తున్నామని, అలాగే జిల్లాలోని పలు మండలాల మామిడి రైతులకు తమ పరిశ్రమతో మేలు పొందుతున్నారని జైన్ మేనేజర్ షమీర్ శర్మ కలెక్టర్ తెలియజేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర ప్రకారమే మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నట్టు చెప్పారు. నాణ్యతా ప్రమాణాలతో ఉత్పత్తులు చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఆయన్ను జ్ఞాపిక, శాలువతో సత్కరించారు.

క్లుప్తంగా

కారు డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో జూలై 18వ తేదీ నుంచి 30 రోజుల పాటు పూర్తి ఉచితంగా పురుషులు, మహిళలకు లైట్ మోటార్ వెహికల్ కారు డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన తిరుపతి, చిత్తూరు జిల్లాల గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు ఉన్న నిరుద్యోగులు శిక్షణకు అర్హులని తెలిపారు. కనీసం విద్యార్హత 10వ తరగతి చదువుకుని ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ట్రైనీస్‌కి ఉచిత భోజనం, రాను పోను ఒక్కసారి చార్జీలు ఇవ్వడం జరుగుతుందని, శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకోదలచిన వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి వారి పేరు నమోదు చేయించుకోవాలని ఆయన కోరారు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న పురుషులకు హాస్టల్ వసతిని సైతం అందించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్ నం.79896 80587, 94949 51289, 83091 64644 సంప్రదించాలని కోరారు.







గన్ షాట్

గంగాధర నెల్లూరు మండలంలోని ఫైరింగ్ రేంజ్‌లో శుక్రవారం గన్‌మెన్లకు ఫైరింగ్‌లో ఇస్తున్న శిక్షణను ఎస్పీ మణికంఠ చందోలు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రకాల తుపాకులతో నీల్ పొజిషన్, స్టాండింగ్ పొజిషన్, లయింగ్ పొజిషన్‌లో అత్యాధునిక ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీసు చేసి సిబ్బందితో ఉత్సాహం నింపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. -చిత్తూరు అర్బన్

ఉపాధి పనుల్లో పారదర్శకతకు ప్రాధాన్యం

-సామాజిక తనిఖీ బహిరంగ సభలో డ్వామా పీడీ రాజశేఖర్



మాట్లాడుతున్న పీడీ రాజశేఖర్

వెదురుకుప్పం: గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు డ్వామా పీడీ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం వెదురుకుప్పంలో సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. మండలంలోని 2023-24 సంవత్సరానికి సంబంధించి 25 గ్రామ పంచాయతీల్లో చేసిన ఉపాధి హామీ పనులను సామాజిక తనిఖీ బృందం పరిశీలించింది. ఉపాధి పనులకు మొత్తం రూ. 10 కోట్లు వ్యయం చేశారు. ఇందులో కూలీలతో చేసిన పనులకు రూ. 8 కోట్లు, వివిధ అభివృద్ధి పనులను రూ. 2 కోట్లు వ్యయం చేశారు. రైతులు చేపట్టిన నీటి కుంటలు పూడిపోయినట్లు గుర్తించారు. వారు నాటిన మామిడి మొక్కలు ఎండిపోయి ఉండడంతో మళ్లీ మామిడి మొక్కలు పెంచాలని రైతులను అధికారులు ఆదేశించారు. లేనిపక్షంలో నగదు రికవరీ చేస్తామని హెచ్చరించారు. అనంతరం డ్వామా పీడీ మాట్లాడారు. ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలకు తావు ఉండకూడదన్నారు. ప్రతి ఒక్కరూ ఉపాధి లక్ష్యాలను అధిగమించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి గంగాభవాని, ఏపీడీ శోభన్‌బాబు, పెన్షన్ తనిఖీ అధికారి రవి, ఎస్టీఎం లోకేశ్వరెడ్డి, ఎస్ఆర్‌పీ మల్లికార్జున్, ఈటీపీఆర్డీ పురుషోత్తం, ఏపీఓ ఇందు, క్షేత్ర సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శోకసంద్రం

బుచ్చినాయుడుకండ్రిగ: 'కూలి పనుల కోసం వచ్చి కడతేరిపోయారా నాయనా..? బిడ్డలు చేతికొచ్చారని సంబరపడ్డాము. ఇక మాకు దిగులుండదని సంతోషించాము. కానీ ఆ దేవుడు మిమ్మల్ని దక్కకుండా చేశాడు. ఇక మేము ఎవరికోసం బతకాలి దేవుడా..?' అంటూ వలసకూలీల బంధువుల రోదనలతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి దద్దరిల్లింది. మండలంలోని శ్రీకాళహస్తి-తడ మార్గంలోని పార్లపల్లి గ్రామ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒడిశాకు చెందిన ముగ్గురు యువకులు మృతిచెందిన విషయం తెల్సిందే. శుక్రవారం మృత దేహాలను అంబులెన్స్‌లో ఒడిశా రాష్ట్రంలోని వారి స్వస్థలాలకు తరలించినట్టు ఎస్ఐ వెంకటనరసింహం తెలిపారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో యువకుల మృతదేహాలు బాహున్ సింగ్ (22), రాజాసింగ్ (22), సుఖ్‌దేవ్‌సింగ్ (22)కు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించగా.. తల్లిదండ్రులు వారిని చూసి కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు చూపరులను కలచివేసింది.

ఎన్నికల హామీలు విస్మరిస్తే ఉద్యమం

- సీపీఐ జిల్లా కార్యవర్గం నిర్ణయం
- వచ్చే నెల 4న కార్యాచరణ ప్రకటన



మాట్లాడుతున్న నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: కూటమి నేతలు ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చకుండా దాటవేత ధోరణి అవలంబిస్తే ఉద్యమిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం చిత్తూరులో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు టీడీపీ కూటమిని గెలిపించడంలో ఎన్నికల హామీలు ప్రధానంగా పనిచేశాయన్నారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పలు హామీల తాలూకు పథకాలకు కోతలు పెట్టడం, లబ్ధిదారులను తగ్గించేందుకు కుట్ర పన్నుతోందని తాజా పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయని ×తల్లికి వందనం₹ హామీని ఉదహరించి మండిపడ్డారు. చిత్తూరు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం, జిల్లాలో ప్రజా సమస్యల పై పోరాడేందుకు సీపీఐ సిద్ధంగా ఉందని, దీనికోసం కార్యాచరణ రూపొందించేందుకు జిల్లా సీపీఐ సర్వసభ్య సమావేశం ఆగస్టు 4న చిత్తూరులో నిర్వహించనున్నటు తెలిపారు. సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్, ఓబులేష్ తదితరులు హాజరవుతారన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జనార్ధన్ మాట్లాడుతూ, చిత్తూరు జిల్లా కేంద్రంలో యూనివర్సిటీ ఏర్పాటు, చక్కెర కర్మాగారం, విజయా డెయిరీ పునః ప్రారంభం కోసం, హంద్రీ-నీవా ప్రాజెక్టు సాధనకు, జిల్లా మామిడి బోర్డు ఏర్పాటుకు పార్టీలకతీతంగా ఉద్యమిస్తామని ప్రకటించారు. ఆగస్టు 4న నిర్వహించే సమావేశంలో పెద్ద ఎత్తున పార్టీ సభ్యులు, సానుభూతిపరులు హాజరు కావాలని కోరారు.

సీఏ, సీఎంఏ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం



విద్యార్థులతో ఎమరాల్డ్స్ డైరెక్టర్లు ఈ.గిరిధర్, కె.విశ్వనాథ్, అధ్యాపకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : సీఏ ఇంటర్, సీఎంఏ ఫౌండేషన్ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని ఎమరాల్డ్స్ విద్యాసంస్థ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేసినట్లు ఆ కళాశాల డైరెక్టర్లు ఈ.గిరిధర్, కె.విశ్వనాథ్ తెలిపారు. సీఏ ఇంటర్ ఫలితాల్లో ఎం.వెంకట్‌యాదవ్ 402, ఎ.చరణ్‌సాయి 377, ఎం.దిలీప్ 365 మార్కులు సాధించారని, వీరితో పాటు 69.76శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. అలాగే సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో ఎం.రాధిక 312, ఎం.ప్రణవ్ 304, బి.లిఖిత్ 298, సి.సుశీలేంద్ర 292 మార్కులు సాధించారని, వీరితో పాటు 91.04 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

పెళ్లి చూపులకు వెళ్లి వస్తూ..

- జాతీయ రహదారిపై ఆవు అడ్డుగా రావడంతో రోడ్డు ప్రమాదం
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి, మరో ఇద్దరికి గాయాలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రామయ్య

చంద్రగిరి: ఆనందంగా పెళ్లి చూపులకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఇంతలో జాతీయ రహదారిపై ఆవు అడ్డుగా రావడంతో వాటిని తప్పించే క్రమంలో కారు బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు గాయాలపాలైన ఘటన పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి ఎం.కొంగరవారిపల్లి వద్ద శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధితుల ఫిర్యాదు మేరకు.. మదనపల్లి మండలం, రెడ్డివారిపల్లికి చెందిన బాలు(26) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. బాలుకు తూర్పుగోదావరి జిల్లా, భీమవరం నుంచి వివాహ సంబంధం రావడంతో పెళ్లి చూపుల కోసం తన తమ్ముడు వాసు, తల్లి శంకరమ్మ, బంధువు ప్రియాంక, స్నేహితుడు దిలీప్‌తో కలసి బుధవారం రాత్రి బెంగళూరు నుంచి భీమవరానికి కారులో వెళ్లారు. గురువారం ఉదయం పెళ్లిచూపులు ముగించుకుని మధ్యాహ్నం అక్కడ నుంచి కారులో బెంగళూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున ఎం.కొంగరవారిపల్లి వద్ద వెళ్తున్న క్రమంలో రోడ్డుకు అడ్డంగా ఆవు రావడంతో వాహనం నడుపుతున్న దిలీప్ ఆవును తప్పించేందుకు యత్నించాడు. దీంతో కారు అదుపు తప్పి ఫల్టీలు కొట్టుకుంటూ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బాలు తలకు తీవ్ర గాయం కాగా, శంకరమ్మ, దిలీప్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రులను తిరుపతి రుయాకు తరలించింది. బాలు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బాధితులు తెలిపారు. అనంతరం పోలీసులు బాలు మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు. పెళ్లిచూపులకు వెళ్లి తిరిగి వస్తూ కుమారుడు మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులు రోదనలు చూపరులను కలచివేశాయి. ఈ మేరకు సీఐ రామయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.



మృతి చెందిన బాలు

అడవి పందులు తెచ్చిన ఉపద్రవం!

- ఘాట్‌లో అడ్డంగా వచ్చిన వన్యప్రాణులు
- తప్పించబోయి గాయపడిన మోటార్ సైక్లిస్టులు
- చికిత్స పొందుతూ ఒకరి మృతి
- మృతుడు అన్నమయ్య జిల్లా వాసి



చికిత్స పొందుతూ మృతి చెందిన మధుకుమార్

బంగారుపాళెం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి తిరుపతిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు. వివరాలు.. అన్నమయ్య జిల్లా వాయల్పాడు మండలం పింగాణి ఫ్యాక్టరీ గ్రామానికి చెందిన మధుకుమార్, రాయచోటి మండలం మాసాపేటకు చెందిన భరత్‌కుమార్, నిమ్మనపల్లె మండలం, తవళం గ్రామానికి చెందిన నాగరాజ ముగ్గురూ బంధువులు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో భరత్ కుమార్ పిన్ని కుమారుని వివాహానికి ముగ్గురూ ద్విచక్రవాహనం (రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ ఏపీ03సీఈ7113)పై వాయల్పాడు నుంచి బయలుదేరి వెళ్లారు. వివాహం అయిన మరుసటి రోజు 10 వ తేది ఉదయం 10 గంటలకు తిరిగి సూళ్లూరుపేట నుంచి పలమనేరులో బంధువుల వద్దకు వస్తూ మార్గమధ్యంలో ప్రమాదానికి గురయ్యారు. మండలంలోని మొగిలి ఘాట్ వద్ద సాయంత్రం జాతీయ రహదారిపై రోడ్డుకు అడ్డంగా వచ్చిన అడవి పందులను తప్పించబోయి అదుపు తప్పి పడ్డారు. ఈ ప్రమాదంలో మధుకుమార్, నాగరాజ తీవ్రంగా గాయపడ్డారు. భరత్ కుమార్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. గాయపడిన వారిని ప్రైవేట్ వాహనంలో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వేలూరు సీఎంసీకి, అక్కడ నుంచి తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ మధుకుమార్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. భరత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్ నిధులపై రాజకీయం చేయొద్దు

-దాదేపల్లె మసీదు మతవల్లి హమీద్‌ఖాన్



మీడియాతో మాట్లాడుతున్న దాదేపల్లె మైనారిటీ నేతలు

చౌడేపల్లె: మండలంలోని దాదేపల్లె మక్కా మసీదుకు సంబంధించి వక్ఫ్ బోర్డు నుంచి మంజూరైన నిధుల వినియోగంలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ప్రశ్నించినందుకు రాజకీయం చేస్తున్నారని మసీదు ముతవల్లి హమీద్ ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం దాదేపల్లె ముస్లిం మైనారిటీలు మీడియా సమావేశం నిర్వహించారు. మసీదుకు వక్ఫ్ బోర్డు నుంచి ఇమామ్, మౌజన్‌లకు 2019 నుంచి మంజూరైన నగదు, ఖర్చుల విషయమై సుల్తాన్‌సాబ్, బషీర్‌సాబ్‌లను వక్ఫ్ బోర్డు అధికారుల సమక్షంలో లెక్కలు ప్రశ్నిస్తే రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. మసీదు అభివృద్ధికి అందరం ఐకమత్యంతో ముందుకెళ్తామని మసీదు ఆర్థిక లావాదేవీల విషయంలో ఇలా చేయడం తగదని ముతవల్లి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మైనారిటీలు యూసఫ్‌సాబ్, మహమ్మద్ ఘని, రహీంఖాన్, దస్తగిరిసాబ్, ఫరీద్‌ఖాన్, హైదర్‌బాషా, చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై అభయం

- ముగిసిన కల్యాణ వెంకన్న సాక్షాత్కార వైభవోత్సవాలు



గరుడ వాహనంపై భక్తులను అనుగ్రహిస్తున్న గోవిందుడు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో మూడు రోజుల పాటు జరిగిన సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. చివరి రోజు రాత్రి గరుడ వాహనంపై స్వామివారు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు కల్యాణ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, కొబ్బరినీళ్లతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం 6 గంటలకు ఊంజల్ సేవ జరిగింది. రాత్రి 7 గంటల నుంచి గరుడ వాహనంపై స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్లు చెంగల్రాయులు, వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు పార్వేట ఉత్సవం

సాక్షాత్కార వైభవోత్సవాలు ముగిసిన మరుసటి రోజైన శనివారం పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీవారిమెట్టు సమీపంలోని మండపంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఆస్థానం చేపడట్టనున్నారు. ఇందు కోసం ఇప్పటికే మండపాన్ని పూలు, విద్యుత్ దీపాలతో టీటీడీ అధికారులు సర్వాంగ సుందరంగా అలంకరించారు.





ఫ్యాషన్ 'షో'

తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఇందిరా ప్రియదర్శినీ ఆడిటోరియంలో శుక్రవారం లోటస్ డిజైనర్ ఫ్యాషన్ షో సభికులను అలరించింది. ఒకేషనల్ ఫ్యాషన్ టెక్నాలజీ విభాగం విద్యార్థినులు తమ ఫైనల్ ఇయర్ ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా వారు డిజైన్ చేసిన మోడల్ వస్త్రాలను ధరించి ఫ్యాషన్ షోలో ర్యాంప్ వాక్‌చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి తిరుపతికి చెందిన ఆర్చిడ్ హోటల్, వరగానీ స్టూడియోస్, ట్విస్ట్ డిజైనర్ స్టూడియోస్, లేఖ పింక్ పాలెట్ ప్రతినిధులు సహాయ సహకారాలు అందించారు. విద్యార్థుల డిజైన్ నైపుణ్యాన్ని, అధ్యాపకులు, వర్సిటీ అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. తాము ఎంచుకున్న రంగంలో విద్యార్థినులు రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని వర్సిటీ వీసీ డీ.భారతి ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ రజిని, హోమ్‌సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బిందు, దేవి హబీబ్ పాల్గొన్నారు. - తిరుపతి సిటీ



వైద్యుడి ముసుగులో 'లైంగికాసురుడు'

- నాలుగేళ్లుగా మైనర్ బాలికపై లైంగికదాడి
- ఇటీవల మగ బిడ్డకు జన్మనిచ్చిన బాలిక
- చిత్తూరులో ఆర్ఎంపీ నిర్వాకం

ఆటపాటలతో అందంగా గడపాల్సిన బాల్యాన్ని పేదరికం ఆ బాలికకు దూరం చేసింది. చిన్నవయస్సులోనే కుటుంబ భారాన్ని మోయాల్సి వచ్చింది. కూలిపనులపై ఆధారపడి తమ కుటుంబం బతుకు బండికి తానో చోదకశక్తి అయ్యింది. అయితే పనిచేస్తున్న చోట లైంగికదాడికి గురైంది. ఒకటీ కాదు..రెండూ కాదు..నాలుగేళ్లుగా..!! ఆ బాలిక పేదరికాన్ని అవకాశంగా తీసుకుని ఆర్ఎంపీ ముసుగులో ఓ మృగాడి అకృత్యాలకు సమిధ అయ్యింది. చివరకు శిశువుకు జన్మనిచ్చింది. ఇది కాస్తా బట్టబయలు కావడంతో ఆర్ఎంపీ పరారయ్యాడు.

చిత్తూరు అర్బన్: టూటౌన్ సీఐ ఉలసయ్య కథనం మేరకు.. స్థానిక సంతపేటకు చెందిన రమేష్ (49) ఆర్ఎంపీగా క్లినిక్ నిర్వహిస్తున్నాడు. ఇతనికి పెళ్లై ఇద్దరు పిల్లలున్నారు. అయితే అదే ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల వయసున్న మైనర్ బాలిక ఇతని వద్ద సహాయకురాలిగా పనిచేస్తోంది. బాలిక తల్లిదండ్రులకు ఈమె ఇచ్చే జీతమే కుటుంబ పోషణకు ఆధారం. అయితే ఆర్ఎంపీ బాలికకకు మాయమాటలు చెప్పి లొంగ దీసుకున్నాడు. నాలుగేళ్లుగా క్లినిక్‌లోనే బాలికపై లైంగిక దాడికి పాల్పడుతున్నాడు. ఇటీవల కడుపు నొప్పి రావడంతో బాలికను చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. ఈ నెల 4వ తేదిన ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఏం చేయాలో దిక్కుతోచని తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితురాలు దళితురాలు కావడంతో రమేష్‌పై అట్రాసిటీ సెక్షన్‌తో పాటు పిల్లలపై లైంగిక దాడి నివారణ(పోక్సో) చట్టం కింద కూడా శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. జరిగిన విషయం తెలుసుకున్న నిందితుడు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఆర్ఎంపీ కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. ప్రస్తుతం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు.

యూపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- రేపు యూపీఎస్సీ పరీక్షలు
- తిరుపతిలో మూడు పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 1,199 మంది అభ్యర్థులు

తిరుపతి అర్బన్ : తిరుపతిలో యూపీఎస్సీ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ఎస్ మురళీ ఆదేశించారు. ఆయన శుక్రవారం పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం యూపీఎస్సీ(కంబైన్డ్ మెడికల్ సర్వీసెస్ పోస్టులకు) పరీక్షలు జరగనున్నాయని, ఇందు కోసం తిరుపతిలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 1,199 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని వెల్లడించారు. తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల వింగ్ ఏ, వింగ్ బీ, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వింగ్ ఏలో పరీక్షా కేంద్రాలు ఉంటాయని వెల్లడించారు. లైజన్ అధికారులుగా ముగ్గురు తహసీల్దార్లు, జిల్లా సమన్వయ అధికారిగా ఒకరిని, కస్టోడియన్‌గా తిరుపతి ఆర్డీవో నిషాంత్ రెడ్డిని నియమించినట్టు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి 11.30 వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రత చేపట్టాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు, వాచ్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించడం లేదని వివరించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి పరీక్షా కేంద్రాల వద్దకు బస్సులు నడపాలన్నారు.